క్లుప్తంగా

నేడు చింతలనర్వలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

చింతలనర్వ(గంపలగూడెం): మండలంలోని చింతలనర్వలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు కోరారు.

పాల సరఫరా పెంచేందుకు చర్యలు



పెనుగొలను(గంపలగూడెం): జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాల సరఫరా పెంచేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వై.పిచ్చిరెడ్డి ఆదేశించారు. పెనుగొలనులో జగనన్న పాలవెల్లువపై గురువారం సిబ్బంది, మహిళా రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలవెల్లువ కేంద్రాలకు పాలుపోసే రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే వివిధ పథకాలను వివరించారు. తహసీల్దార్‌ బాలకృష్ణారెడ్డి, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ కౌంటర్‌ ఏర్పాటు చేయాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏపీఎస్‌ఆర్టీసీ బస్‌పాస్‌ రెన్యూవల్‌ కౌంటర్‌ కొండపల్లిలో ఏర్పాటు చేయాలని డీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు డిపో అధికారులను గురువారం ఒక ప్రకటనలో కోరారు. కొండపల్లి నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు బస్‌పాస్‌ ద్వారా విజయవాడ పరిసర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణం చేస్తారన్నారు. ప్రతి నెలా రెన్యూవల్‌ చేసుకునేందుకు ఇబ్రహీంపట్నం రావడానికి సమయం వృథా అవుతుందన్నారు. ప్రయాణికుల సమస్యను దృష్టిలో ఉంచుకుని బస్‌పాస్‌ రెన్యూవల్‌ కౌంటర్‌ కొండపల్లిలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

మైలవరం: ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆనంద్‌రావు కోరారు. మండల పరిధిలోని కొత్తగూడెం, మంగాపురం గ్రామాల్లో గురువారం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆనందరావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో కోత పెడుతూ మౌలిక సదుపాయాలు పూర్తిగా ఎత్తి వేసిందన్నారు. ఉపాధి పనికి సంబంధించి చట్టంలో పొందుపరచిన వాటిని అమలు చేయాలని జాబ్‌ కార్డుకు 100 రోజులు పనిని 200 రోజులకు పెంచాలని డిమాండ్‌ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న విజయవాడలో పీడీ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరరావు మృతి తీరని లోటు



తిరువూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి ఏ.కృష్ణసుందరరావు మృతి తీరనిలోటని ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్‌ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్‌ అన్నారు. స్థానిక యూటీఎఫ్‌ భవన్‌లో గురువారం కృష్ణసుందరరావు సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. యూటీఎఫ్‌ స్థానిక, జిల్లా నాయకులు ముత్తయ్య, భరతకుమారి, వినయ్‌కుమార్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత

మల్లేల(తిరువూరురూరల్‌): మండలంలోని మల్లేలలో కృష్ణా మిల్క్‌ యూనియన్‌ సభ్యులైన కందిమళ్ల అప్పారావు కుమారుడి వివాహ సందర్భంగా బుధవారం రాత్రి బంగారు నాణేన్ని లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి అందజేశారు. యూనియన్‌ సభ్యుల కుటుంబాల్లో వివాహం సందర్భంగా రూ.20 వేల విలువైన బంగారు నాణేన్ని బహుమతిగా ఇవ్వాలని యూనియన్‌ నిర్ణయించినట్లు తెలిపారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

ఆగిరిపల్లి: మండలంలోని వడ్లమాను, చొప్పరమెట్ల గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఆ గ్రామాల్లో వ్యవసాయ భూములు కలిగిన రైతులకు శుక్రవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్‌ మంచిరాజు ఉదయభాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు చొప్పరమెట్లలో, 11 గంటలకు వడ్లమానులో అవగాహన సదస్సు జరుగుతుందని, రైతులు హాజరు కావాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన



తిరువూరు గ్రంథాలయంలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

రెడ్డిగూడెం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. రెడ్డిగూడెం శాఖ గ్రంథాలయంలో టి.స్వామి ఆధ్వర్యంలో పూజలు ఎందుకు చేయాలి, నీతి కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం, యోగా నేర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషను ఇష్టంగా నేర్చుకోవాలి

తిరువూరు: ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జనాభా మాట్లాడే ఆంగ్ల భాషను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నేర్చుకోవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్‌ రాంప్రదీప్‌ సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో స్పోకెన్‌ ఇంగ్లిష్‌ ప్రాధాన్యతను తెలిపారు. ఇంగ్లిషులో మాట్లాడటం, గ్రామర్‌పై పట్టు సాధించడంలో సులభతర విధానాలను వివరించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి గంగాధర్‌, తిరువూరు పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పాపారావు, సుదర్శన్‌ పాల్గొన్నారు.

విద్యార్థులచే పంచతంత్ర కథల పఠనం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే పంచతంత్ర కథల పఠనం గావించారు. అనంతరం ఉపాధ్యాయులు టి.నాగరాజు విద్యార్థులకు గణితంలో మెలకువలు, ఎక్కాలు సులభంగా నేర్చుకొనే విధానాన్ని వివరించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు జ్యోతిర్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడులో శిక్షణ శిబిరం నిర్వహణ

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, వారితో కథలు చెప్పించారు. రిటైర్డ్‌ ఎంఈవో వంగల గోవిందరావు విద్యార్థులకు పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. వాతావరణంలో కాలుష్యం పెరిగిపోయి దుష్ఫలితాలు సంభవిస్తున్నాయన్నారు. రోజురోజుకు ఆక్సిజన్‌ శాతం తగ్గి కార్బన్‌డయాక్సైడ్‌ శాతం పెరుగుతోందని, దీంతోనే భూతాపం పెరుగుతోందన్నారు. దీనిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని, కాలుష్యాన్ని వెదజల్లే కారకాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చదివిన పుస్తకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రెడ్డిగూడెంలో పుస్తకం పఠనం చేస్తున్న విద్యార్థులు



తిరువూరులో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను హైస్కూల్‌ తెలుగు ఉపాధ్యాయుడు కె.మోహన్‌రావు విద్యార్థులకు వివరించారు. విజ్ఞానం పెరగడంతో పాటు కొత్త విషయాలను తెలుసుకుంటామన్నారు. సెల్‌ఫోన్‌లకు, టీవీలకు దూరంగా ఉండి పుస్తకాలకు దగ్గరగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చదరంగంలో మెలకువలను నేర్పారు. క్రీడా రంగంలో చదరంగానికి ఉన్న ప్రాధాన్యతను శిక్షకుడు జానీ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చదరంగంలో విజేతలకు ఉండే గుర్తింపును విపులీకరించారు. తెలుగు గ్రామర్‌, అక్షర మాల, పద్య పఠనంపై తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు సూచనలిచ్చారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.



నూజివీడు గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థిని

వైభవంగా గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌ అప్పారావు

ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడులో గంగానమ్మతల్లి ఆలయం 11వ వార్షిక వేడుకలకు గురువారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీటీసీ సభ్యుడు వనమా ఏసు, సీపీ నాయకులు యలమర్తి ప్రకాశ్‌, చిమట సీతారామరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సింహాద్రి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌ కార్డులు అందజేయాలి



ఆగిరిపల్లి ప్రజా వేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాము

ఆగిరిపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ జాబ్‌ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ అర్వపల్లి రాము ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద గతేడాది ఏప్రిల్‌ నుంచి ఈ ఏడాది మార్చి 30 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.వాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో ఆయా శాఖల విభాగంలో జరిగిన రూ.12,65,14,805 కోట్ల పనులపై ఆయా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆ సామాజిక తనిఖీల్లో అడవినెక్కలంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ లేకపోవడంతో అతని స్థానంలో టెక్నికల్‌ అసిస్టెంట్‌తో విధులు నిర్వహించేలా ఏపీవో ఆదేశించడంతో విధులు నిర్వహించిన టీఏ మస్టర్లు నమోదు చేయలేదు. దీంతో ప్రజావేదికలో డ్వామా పీడీ రాము టీఏకు, సీవోకు, ఏపీవోకు రికవరీకి ఆదేశించారు. గ్రామంలో పలు సమస్యలను సర్పంచ్‌ మురళీమోహనరావు ప్రస్తావించారు. ఉపాధి హామీ పథకంపై దృష్టి సారించాలని ఎంపీడీవో వాణిని డీపీఆర్‌ఓ ఏవీ విజయలక్ష్మి సూచించారు. ఎస్‌ఆర్పీ రాంచంద్రరావు, సీతారామపురం సర్పంచ్‌ అత్తి మురళీమోహనరావు, ఆగిరిపల్లి-2 ఎంపీటీసీ సాదం గోపీనాథ్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్‌ దాడులు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం సెక్షన్‌లో విద్యుత్‌ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్‌ శాఖ విజిలెన్స్‌ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్‌ ఈఈ కూన వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఆయన మాట్లాడుతూ.. 43 బృందాలుగా ఏర్పడి 2,112 గృహ సర్వీసులు, 89 వాణిజ్య సముదాయాల సర్వీసులు, 6 ఇతర సర్వీసులు తనిఖీ చేశారన్నారు. వాటిలో 166 సర్వీసులకు అదనపు లోడు 252 కేడబ్ల్యూ మొత్తానికి రూ.4,60,603, విద్యుత్‌ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ.75వేలు జరిమానా విధించామన్నారు. కేటగిరిల్లో మార్పులపై ఇద్దరికీ రూ.23 వేలు జరిమానా విధించామని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నూజివీడు ఈఈ డి.కృష్ణారావు, ముగ్గురు డీఈలు, 18 మంది ఏఈలు, 22 మంది లైన్‌ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రెడ్డిగూడెం: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం పాతకొండూరు గ్రామానికి చెందిన మార్లెల్ల పుల్లయ్య(38), మద్దులపర్వ గ్రామానికి చెందిన కంచర్ల విజయలు ఈనెల 7న మద్దులపర్వ గ్రామంలోని కంచర్ల వెంకమ్మ ఇంటిలోని బీరువాలోని నగలను దొంగిలించారు. వెంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెడ్డిగూడెం పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను బుధవారం అరెస్టు చేసి 41నోటీసు ఇచ్చి విడుదల చేశారు. కాగా కంచర్ల విజయ డ్వాక్రా గ్రూపు నుంచి మంజూరైన రూ.1.20 లక్షలను పుల్లయ్యకు ఇచ్చానని, తన డబ్బులు తనకు ఇవ్వాలని విజయ పుల్లయ్యను అడిగింది. పుల్లయ్య తాను తీసుకోలేదని అనడంతో విజయ, ఆమె అత్త వెంకమ్మలు అతనిపై దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన పుల్లయ్య పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకుని రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఎస్‌ఐ శ్రీను తక్షణమే స్పందించి నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పసుపు కొమ్ముల నోము



నోములో పాల్గొన్న మహిళలు

గంపలగూడెం: లక్ష పసుపు కొమ్ముల నోమును గంపలగూడెంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంపలగూడెంకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు దారా వెంకటేశ్వరరావు సతీమణి దారా విజయలక్ష్మి తన నోముల్లో భాగంగా లక్ష పసుపు కొమ్ముల నోము తీర్చుకొంది. ముందుగా లక్ష పసుపు కొమ్ములను గౌరీదేవి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయలక్ష్మి పసుపు కొమ్ములను, చీర, జాకెట్‌, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లను వాయనంగా 415 మంది మహిళలకు అందజేశారు. ఈసందర్భంగా మహిళలు లక్ష్మీస్తోత్రం, విష్ణు, లలితా సహస్రనామార్చన, గోవిందనామాలు, సాయినక్షత్రమాలిక, మణిదీపవర్ణన పఠనం భక్తిశ్రద్ధలతో గావించారు. గంపలగూడెం, తిరువూరు, ఏ.కొండూరు, తెలంగాణా రాష్ట్రం మధిర, కల్లూరు, తల్లాడ, వైరా, సత్తుపల్లి మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

చేతివృత్తులను ప్రోత్సహించాలి



తిరువూరు: మహిళలు స్వయం ఉపాధి కోసం చేపట్టిన చేతివృత్తులకు తగు ప్రోత్సాహాన్ని అందించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌ బాలకృష్ణ కోరారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద గురువారం మెప్మా గ్రూపుల సభ్యులైన మహిళలు ఏర్పాటు చేసిన ఉత్పత్తి స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం స్వయం ఉపాధి గ్రూపుల మహిళలకు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తిరువూరు: తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన పైలట్‌ ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌ బాలకృష్ణ సమీక్ష నిర్వహించారు. ఏఐఐబీ ప్రాజెక్టులో భాగంగా పైపులైన్లు నిర్మించేందుకు తవ్విన సీసీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, రిజర్వాయరు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పబ్లిక్‌ హెల్త్‌ అధికారులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జె.లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీ విభాగం ఆధ్వర్యంలో సైన్స్‌ ఫెస్ట్‌ను నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1998 మే 11న పోఖ్రాన్‌లో జరిగిన అణుపరీక్షల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా జాతీయ సాంకేతిక దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.

మోక్షధామం ఏర్పాటు అభినందనీయం



సత్యాలపాడులో మోక్షధామం ప్రారంభిస్తున్న రామచంద్రరాజు

సత్యాలపాడు(గంపలగూడెం): గ్రామంలో మోక్షధామం ఏర్పాటు అభినందనీయమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొమరగిరి శ్యాం ప్రసాద్‌ అన్నారు. మండల పరిధిలోని సత్యాలపాడు శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి మోక్షధామం(శ్మశాన వాటిక)ను విశ్రాంత తహసీల్దార్‌ తోకచిచ్చు రామచంద్రరాజు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శ్యాం ప్రసాద్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో సేవా దృక్పథం పెరగాలన్నారు. భగవాన్‌ సత్యసాయిబాబా చూపిన మార్గంలో పయనించాలని చెప్పారు. ప్రముఖ కవి, సినీ రచయితలు రసరాజు, జయ విజయరాజు, తోకచిచ్చు రంగారాజు, తిరువూరు సమితి కన్వీనర్‌ దామోర ప్రభాకర్‌ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు



నూజివీడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌, నాయకులు

నూజివీడు: రాష్ట్రంలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని 30వ వార్డులో ఎమ్మెల్యే ప్రతాప్‌ గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యేకు వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాదిలోనే నెరవేర్చి జనం మెచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందరి మన్ననలు పొందారన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌ రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. చంద్రబాబు అండ్‌ కో మాయమాటలు చెప్పి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారి మాటలు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పగడాల సత్యనారాయణ, కో–ఆప్షన్‌ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, కౌన్సిలర్లు నడకుదురు గిరీష్‌, నవుడు నాగమల్లేశ్వరరావు, దాసరి మారు అప్పాజీ, మున్సిపల్‌ కమిషనర్‌ సయ్యద్‌ అబ్దుల్‌ రషీద్‌, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, మెప్మా సీఎంఎం ఆనంద్‌, ఏఈ కృష్ణ, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



యనమదల సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీఖాన్‌

నూజివీడు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఎల్‌.అలీఖాన్‌ ఆదేశించారు. మండలంలోని యనమదల సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో సందర్శించి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డుల నిర్వహణను మరింత మెరుగ్గా నిర్వహించాలన్నారు. సిబ్బంది ఎవరైనా కార్యాలయాన్ని వదిలిపెట్టి బయటకు వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా మూమెంట్‌ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదు



మొర్సపూడిలో కౌన్సెలింగ్‌ నిర్వహిస్తోన్న రూరల్‌ ఎస్‌ఐ రామకృష్ణ

నూజివీడు: ఆటోలు, ట్రక్కు వాహనాల్లో ప్రయాణికులను, కూలీలను ఇష్టారాజ్యంగా సామర్థ్యానికి మించి ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని రూరల్‌ ఎస్‌ఐ తలారి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని మొర్సపూడి వద్ద నూజివీడు–హనుమాన్‌జంక్షన్‌ రోడ్డుపై గురువారం వాహనాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆటో, ట్రక్కు వాహనదారులకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఇష్టారాజ్యంగా ప్రజలకు ఎక్కించుకుని నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆటోల్లో డ్రైవర్‌ పక్కన ప్రయాణికులను, కూలీలను ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రయాణికుల భద్రతే ముఖ్యంగా ఆటోలను నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమేటిక్‌ క్లోరినేషన్‌ ఎక్విప్‌మెంట్‌ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న తదితరులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు కొటికలపూడి ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ వద్ద జలజీవన్‌ మిషన్‌ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్‌ క్లోరినేషన్‌ ఎక్విప్‌మెంట్‌ను ఎంపీపీ పాలడుగు జోత్స్న గురువారం ప్రారంభించారు. ఆటోమేటిక్‌ క్లోరినేషన్‌ ద్వారా నీటిలోని బ్యాక్టీరియా, వైరస్‌ మూలాలను నశింపజేస్తుందన్నారు. హైడ్రోజన్‌ సల్ఫేట్‌ను నశింపజేసి అమ్మోనియా, నైట్రోజన్‌ కాంపౌండ్‌ను నీటి నుంచి తొలగిస్తుందని చెప్పారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతుందన్నారు. వైస్‌ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచ్‌ రెంటపల్లి నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

మైలవరం: ఎన్టీఆర్‌ జిల్లాలోని అన్ని ఎయిడెడ్‌, ప్రైవేట్‌ పాఠశాలల యాజమాన్యాలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో పి.రత్నశ్యామ్‌బాబు గురువారం హెచ్చరించారు. ప్రభుత్వం మే 1 నుంచి జూన్‌ 6వ తేదీ వరకు విద్యార్థులకు సెలవులు ప్రకటించిందని, ఎయిడెడ్‌, ప్రైవేట్‌ పాఠశాలలు దీనిని తప్పనిసరిగా పాటించాలన్నారు. 9వ తరగతి పూర్తి చేసుకుని 10వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం ప్రభుత్వ నియమావళికి విరుద్ధమని చెప్పారు. ఎయిడెడ్‌, ప్రైవేట్‌ పాఠశాలలు వేసవి సెలవుల్లో పాఠశాలలు తేరవకూడదని, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరిధిలో పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత పాఠశాలలను తీవ్రంగా పరిగణించి, వాటి గుర్తింపు రద్దు చేస్తామని ఎంఈవో తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



చాట్రాయిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్‌ విశ్వనాథరావు

చాట్రాయి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ విశ్వనాథరావు కోరారు. మండలంలోని చాట్రాయి పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ.. రైతు శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మద్దతు ధర క్వింటాకు రూ.1,960 చొప్పున కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా మండలంలోని పోలవరం, తుమ్మగూడెం పీఏసీఎస్‌ల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ దామెర బుచ్చిబాబు, వ్యవసాయ అధికారి బి.శివశంకర్‌ పాల్గొన్నారు.